# సమాజం సగం మారితే...?



కోరుకొండ సత్యానంద్

సాయంత్రం అయిదు దాటింది. పగలంతా ఈ సువిశాల ప్రపంచంపై నిప్పుకణాల్ని చెరగి భానుడు పడమటి కొండల శీతల వాయువుల పందిట్లోకి చేరుకుంటున్నాడు...

అప్పుడే ఆఫీసునుండి వచ్చి సైకిలు గోడకు జారవేసి ఇంట్లోకి వెళ్ళాడు వేణు. అతనిలో ఈరోజు ఆనందం అనంత విశ్వాన్ని మించిపోయింది. ఆత్రుతగా, ఆనందంగా లోపలకు వెళ్ళాడు... వరండాలో, మధ్య గదిలో ఎవరూ లేరు... పెరటి గుమ్మం దగ్గరకు వెళ్ళి చూశాడు.

లేలేత పచ్చని చిగుర్ల సందుల్లో దాక్కొని ఓరగా చూస్తున్న సుందర సుకుమార పరిమళ భరితమైన సన్నజాజుల్ని తన మునుమెత్తని వేళ్లతో కోస్తోంది పరిమళ. అక్కడింకా అనేక రకాల పూల మొక్కలు. ఆ మొక్కల మధ్య వనదేవతలా పరిమళ.. పరిమళ అంటే ఎనలేని ప్రేమ వేణుకు. అందులోనూ ఈ రోజు, ఆమె జీవిత బాటలో సువర్ణం చిందులేయబోయే రోజు... అందుకే అతనిలో ఇంత ఆనందం ఆత్రుత...

ఈరోజు కోసం అతను ఎన్ని రోజుల్ని యుగాల్లా గడిపాడో, ఎన్ని కలలు కన్నాడో ఆ భగవంతునికే తెలుసు.

"పరిమళా!" అని పిలిచాడు వేణు.

ఆ పిలుపుకు పరిమళ అటువైపు చూసి "అన్నయ్యా! వచ్చేశావా!" అంది.

"అవునమ్మా! ఈరోజు నీకో శుభవార్త చెప్ప బోతున్నానమ్మా" గుండెల నిండా ఆనందం నిండి పోయినట్లుగా అన్నాడు.

ఆ మాటకు పరిమళలో ఎట్టి మార్పు కలగలేదు. ఎప్పుడూ చెప్పే మాటేకదా అనుకుంది... కానీ అడగక పోతే బాగుండదని.

"ఏమిటన్నయ్యా?" అంది.

"ఏమంటే ఏం చెప్పను పరిమళా! ఇన్నిరోజులూ మనం వాదులాడుకొనే వాళ్ళంచూడు...మనుషులంతా మారిపోయారు. ఈ తరం నవనాగరికంతోపాటు మంచి ఆశయాలతో ముందుకి పరుగులు తీస్తోంది అంటే నీవొప్పుకునేదానివి కాదు...ఇప్పుడేమంటావ్? ఒక ఆఫీసరు కానీ కట్నం లేకుండా నాకు బావగా వస్తున్నాడమ్మా!" అన్నారు.

ఎన్నోసార్లు వేణు 'కట్నాలు పుచ్చుకోవడాన్ని ఈతరం యువకులందరూ నిరసిస్తున్నా'రని, పరిమళ 'ఎవరో మాటకో, కోటికో నీలాటివాడు తప్ప ఎవరూ కట్నాన్ని విషంలా భావించడం లేదని' వాదించుకొనేవారు.

కానీ ఆ వాదనలో చివరకు తనే గెలిచాడనీ, తన చెల్లెలు జీవితం నందనవనం అవుతుందని వేణు ఉప్పొంగి పోతున్నాడు.

అంతలో రాధ తలారస్నానం చేసి తలకు టవల్ చుట్టుకొని, చెవులకు దుద్దుల్ని పెట్టుకుంటూ అక్కడకు వచ్చింది..."ఏమిటో అన్నా చెల్లెళ్ళిద్దరూ చెవులు కొరుక్కుంటున్నారు....? నే వినొచ్చా?" అంది.

"ఎందుకు వినకూడదూ...? నాకు గుమాస్తా మొగుడైతే, నా ఆడపడుచుకి ఆఫీసరు మొగుడా? అని ఉడుక్కోనంటే చెప్తాం!" అన్నాడు చెల్లెలి వైపు కొంటెగా చూస్తూ..

పరిమళ సిగ్గుతో అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

"పిచ్చిపిల్ల! ఏమిటండీ, ఎవరు వాళ్ళు? ఎప్పుడొస్తారు?"

"చెప్తా ఆగూ! వాళ్ళది రాజమండ్రి. పెళ్ళి కొడుకు ఏదో బాంకులో ప్రొబేషనరీ ఆఫీసరట... మధ్యాహ్నం, మా ఫ్రెండ్ గోపాల్ లేడూ? ఆ అబ్బాయి తండ్రిగారిని ఆఫీసుకు తీసుకొచ్చాడు.... ఇందాక వరకూ అన్ని విషయాలు మాట్లాడాం!" అన్నాడు వేణు.

"కట్నం ఎంతట....?"

"కట్నం, గిట్నం నహి! ఆయన చాలా మంచివారు రాధా... ఈతరం తల్లిదండ్రులంతా అలా ఉంటే ఎంత బాగుంటుందంటావ్?"

"చాలా బాగుంటుందిగానీ, వాళ్ళెప్పుడొస్తారుట? ఆయన్ని తీసుకురాలేక పోయారా?" అంది..."గోపాల్ అన్నీ చెప్పాట్ట... అందరూ కలిసి ఒక్కసారే ఆదివారం వస్తాం అన్నారు.. పరిమళను పుత్తడి బొమ్మలా తయారుచేసి పెళ్ళికొడుకు ముందుంచాల్సిన బాధ్యత నీది... మిగతా విషయాలు నే చూసు కుంటాను... అవునట్లు.. బాబేడీ...?" అడిగాడు వేణు.

అంతలో నాలుగేళ్ళ బుజ్జి పరుగెత్తుకుంటూ అక్కడి కొచ్చాడు....

"అడ్డడ్డడ్డే...ఏమిట్రా బుజ్జీ! బట్టలన్నీ మురికి చేసుకున్నావు? రాధా! బాబుకు బట్టలు మార్చు... ఇంటరా బుజ్జీ...." అని చాక్లెట్ బుజ్జి కందించి టవల్ తీసుకొని బాత్రూమ్ వైపు వెళ్ళాడు.

స్నానంచేసి వరండాలో సిగరెట్ కాల్చుకుంటూ కూర్చున్నాడు వేణు..

అతని మనసు ఆరోజు పడిన సముద్రంలో అల్లల్లాడిన నావ సుస్థిరంగా తీరం చేరినట్లుంది... ఈ శుభ సమయంకోసం అతనెన్ని రోజులు ఎదురు చూశాడు?

ఈరోజుల్లో, ఈ తరంవాడా అనుమానించాలని లేదు. తను మాత్రం పిచ్చిగా ప్రవర్తించాడేమో అని అనుకునేవాడు.. చెల్లెలు పెళ్ళి చేయలేక చివరికి అసమర్థునిగా మిగిలిపోతానేమో అనుకొనేవాడు.

కానీ.. డు ఆశయాలు నిండిన సమర్థుడనని తనలో తనే కాస్త గర్వపడ్డాడు.

చదువుపూర్తయిపోయిన వెంటనే చిన్నదో పెద్దదో అదృష్టం కొద్దీ ఉద్యోగం దొరికింది...ఏ విషయంలో కూడా తల్లి మాట జవదాటని వాడు కట్నం విషయంలో మాత్రం తల్లి ఎంత పోరు పెట్టినా, ఆర్థికంగా తమ పరిస్థితులెలా ఉన్నాయో అని ఎంతగా ఏకరువు పెట్టినా, కట్నం పుచ్చుకోకపోతే నీకింక కన్నించని అన్నా తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు వేణు.

కాలేజీలో కట్నాల గురించి తను, తన క్లోజు ఫ్రెండ్ భాస్కర్ కలిసి ఎన్నిసార్లో స్టేజిమీద ఉపన్యాసాలిచ్చి పదిమంది పెద్దలచేతా 'శభాష్' అన్పించుకున్నారు. అలాంటిది తనే కట్నం పుచ్చుకుంటే... అని మొత్తానికి తన పట్టును సడలించలేదు.

చివరకు కట్నం లేకుండా, అతి సాధారణంగా, నిరాడంబరంగా రాధను పెళ్ళి చేసుకున్నాడు... కానీ, పెళ్ళయిన రెండు సంవత్సరాల్లోనే తనమాట నెగ్గించుకొని తల్లి శాశ్వతంగా వెళ్ళిపోయింది. అప్పటినుండీ పరిమళను రాధ, వేణులు తల్లిదండ్రులకంటే ఎక్కువగా చూసుకున్నారు... మరు సంవత్సరంలోనే ఆ ఇంట్లో బుజ్జి పుట్టాడు.

అప్పుడు పరిమళ ఇంటర్లో జాయినయ్యింది.

అప్పటినుండీ పరిమళకు సంబంధాలు చూడడం మొదలుపెట్టాడు వేణు.

చాలా సంబంధాలొచ్చాయి. ఒకొక్కళ్ళూ పదేసి వేలు, పదిహేనేసి వేలు కట్నాలు అడిగేవారు... పెద్ద పెద్ద చదువులు చదివినా ఆ పెళ్ళికొడుకులు ఇంకా, ఈ కాలంలోకూడా, తల్లిదండ్రులు కట్నం అడుగుతుంటే తలదించుకొని కూర్చోవడం చూస్తూంటే వేణుకు తగని అసహ్యం వేసేది... కొన్ని సార్లు వాళ్లను ముఖంమీదే ఏదోటి అనేసేవాడు.

''కట్నం లేకుండా ఆడపిల్లను ఎవరు చేసుకుంటార...?'' అనేది రాధ.

''ఎందుకు చేసుకోరు రాధా? ఎప్పటికైనా పరిమళను కట్నం లేకుండానే పెళ్ళిచేస్తాను... ఆదర్శాలుగల మనిషి, కాలంతో పరుగులుతీసే జ్ఞాని నా చెల్లెలికి భర్తగా కావాలిగానీ, ఇంకా కట్నాన్ని కౌగలించుకునే తెలివి తక్కువ వాడు, కుసంస్కారి కాదు...'' అనేవాడు.

అలా కాలం కరిగిపోతుంది...

ఒకసారి కట్నం అక్కర లేదు, అని ఓ పెళ్ళికొడుకు వచ్చాడు. అన్ని విషయాలు మాట్లాడుకున్నారు... ఇన్నాళ్ళకు కట్నం వద్దని వచ్చిన పెళ్ళికొడుకుని చూసి మొదట ఎంతగానో సంతోషించారు కానీ, పెళ్ళికొడుకు తల్లి 'కట్నం కానీ అక్కరలేదు గానీ, ఇల్లుమాత్రం అబ్బాయిపేర పెట్టాలి బాబూ!' అంది అతి నెమ్మదిగా ఆ ఇల్లు అద్దెకిల్లని తెలియక.

పెళ్ళి కొడుకుని అడిగాడు ఈ విషయం గురించి. ''అటువంటి విషయాలు పెద్దవాళ్ళతో మాట్లాడండి!'' అన్నాడాయన.

అంతే! వేణు తోక్కతొక్కిన పామయ్యాడు... ఆ సంబంధం కూడా అలాగే వెళ్ళిపోయింది.

అలా ఎన్నో సంబంధాలు తప్పిపోయాయి....

పరిమళ ఇంటర్ పూర్తిచేసి ఇంట్లో కూర్చుంది.

# నా హృదయమే ఒక చెలమ

నా హృదయమే ఒక చెలమ.
కన్నీళ్ళే కమ్మని నీళ్ళు
తోడుతుంటాను
ఊరుతుంటాయి
దోసిళ్ళ కొద్దీ ఆశగా
తాగుతుంటాను.
ఎంత తాగినా
దాహం తీరదు
ఎంత తోడినా
ఊట ఆగదు.
తీరని తీయని దాహంతో
తీస్తుంటాను ఊట
తాగుతుంటాను ప్రతి పూట
రాస్తుంటాను ఒక పాట
అందుకే అంటాను —
ఊట లేని చెలమలా
హృదయం ఉండకూడదనీ,
కన్నీళ్ళనే నీళ్ళు లేక
ఎన్నడూ ఎండకూడదనీ.

— జి. వెంకటేశ్వర్లు

చెల్లెల్ని చూసినప్పుడల్లా వేణు గుండె కరిగిపోయేది. వయసొచ్చిన పిల్లను ఇంట్లో పెట్టి కూర్చోకూడదు అని.

''ఎక్కడ్నుంచి తెమ్మంటావ్ రాధా? వెయ్యా? రెండు వేలా? పది, పదిహేను వేలు కట్నం ఇచ్చి, పెళ్ళి ఖర్చు మరో ఆరేడు వేలు... వాళ్ళ కోర్కెలు తెల్లార్చేసరికి మన బ్రతుకులు ఆరిపోయేలా ఉన్నాయి..'' అనేవాడు.

కేవలం పరిమళ పెళ్ళికోసం. ఆ ఇంట్లో శాంతి లేకుండా పోయింది. ఎప్పుడూ చెల్లెలి పెళ్ళికోసమే వేణు ఆలోచన, తపన.

అన్నగార్ని అలా చూస్తుంటే పరిమళకు ఏడుపొచ్చేది... తనకోసం, తన పెళ్ళికోసం అన్నయ్య, ఒదిన ఎంత బాధ పడుతున్నారో చూస్తుంటే, ఆడపిల్లగా పుట్టడం అంత దురదృష్టం ఈ లోకంలో మరింకేమీ లేదనిపించింది.

అలాంటి అయోమయ పరిస్థితుల్లో, ఈరోజు వేణుకు ఈ సంబంధం తారసపడింది... మండు టెండలో శ్రావణ మేఘంలా..

అందుకే అతని హృదయం అంతలా తేలిపోతుంది హాయిగా.

''భోజనానికి లేవరా?'' అన్న రాధ పిలుపుకు ఉలిక్కిపడి ''ఊ'' అన్నాడు.

''చెల్లెలు పెళ్ళి గురించి కలలు కనడంలో తిండి, నిద్రకూడా మరచి పోతున్నట్టున్నారే?''

''లేదు రాధా! ఏమిటో ఇవాళ ఆలోచనలన్నీ ఒక్కసారిగా వెనక్కి వెళ్లాయి...''

''భోజనానికి రండి... తరువాత ఆలోచించుకుందురుగానీ...'' అంది రాధ.

భోజనాల దగ్గర—''ఏం కూరలొండావ్ రాధా?''

''అరటికాయ వేపుడు, సాంబారు...అప్పడాలు.. నేను కాదు, మీ ముద్దుల చెల్లెలే వండింది లెండి...'' అంది రాధ పరిమళవైపు చూస్తూ.

''ఐతే ఈరోజు పూర్తిగా కానిచ్చేయాలి.... ఒరే బుజ్జీ! నువ్వుకూడా ఇవాళ కలిపికొట్రా...అవును గానీ బుజ్జీ! అత్తకు పెళ్ళయిన తర్వాత అత్తనేమి అడుగుతావురా?''

బుజ్జి నవ్వుతూ పరిమళవైపు చూసాడు.

''అత్తను నీ కో బుజ్జి పెళ్ళాన్ని అడగరా!'' అంది రాధ.

బుజ్జి పరిమళవైపు చూసి వెక్కిరించాడు.

''పోరా వెధవా!'' గోముగా అంది పరిమళ.

బుజ్జి మరింతగా నవ్వాడు.

భోజనాలు పూర్తయ్యేసరికి గంట పట్టింది.

బుజ్జి, పరిమళ ఒక గదిలోపడుకున్నారు.....

రాధ, వేణు ఒక గదిలో పడుకున్నారు.

''ఏమండీ! పెళ్ళి చేద్దాం అంటున్నారు కదా, డబ్బు విషయం ఏమైనా ఆలోచించారా?'' అంది రాధ మౌనంగా ఉన్న వేణుతో.

''అదే రాధా! నేనూ ఆలోచిస్తుందీను... ఎక్కడైనా ఓ అయిదు వేలు అప్పుతీసి మా కంపెనీలో లోన్ పెడదామనుకుంటున్నాను... మొత్తం ఎనిమిది వేలతో అయ్యిందన్పించొచ్చు.. కట్నంఎలాగూలేదు, ఆమాత్రం ఘనంగానైనా చేయాలి కదా!''

''చేద్దాం సరే! కానీ, అప్పుచేయడం కంటే, మీరు వింటానంటే నే నో మాట చెప్తాను... చేస్తారా?'' అని అడిగింది రాధ.

''చెప్పు... ఆలోచిద్దాం!''

''నా పెళ్ళికి మావాళ్ళిచ్చిన నెక్లెస్, లాకెట్, గాజులు ఉన్నాయికదా! అప్పుచేస్తే నెలనెలా టంచనుగా వడ్డీ కట్టాలి... ఇవి అమ్మేసి మిగతాది లోన్ తీస్తే సరిపోతుంది....''

''రాధా! నా చెల్లెలు పెళ్ళికోసం నీ నగలు... వద్దు రాధా! మీవాళ్ళు ముచ్చటగా పెట్టుకున్న నగలు నే నమ్మడం బాగుండదు రాధా!''

''అదేమిటండీ అలా అంటారు? మన పెళ్ళయిన తర్వాత మీది, నాది అని వేరు లేదండి! అంతా మనదే! ఏం చేసినా మన మంచికోసమేనండీ! ఇందులో బాగుండడం, బాగుండక పోవడం ఏముందండి? రేపొద్దున కలిగితే చేయించుకోవచ్చు... ముందు పని జరిగేట్టు చూడండి...'' అంది రాధ.

ఆ మాటలకు వేణు మనసు అదోలా ఐపోయింది.

''రాధా! నా ఆదర్శాలకు తగ్గ భార్యవు దొరికావు.

నా అంత అదృష్టవంతుడు లోకంలో ఇంకెవ్వరూ ఉండరు. రాధా!'' అని ఆమె చేయిని ఆప్యాయంగా నొక్కాడు..

"సర్లెండి... ఉదయం ఆఫీసుకి వెళ్ళాలి, పెందరాలే పడుకోండి..." అని రాధ ప్రక్కకు తిరిగి పడుకుంది.

వేణు కూడా బెడ్‌లైట్ కాంతిలో తిరుగుతూ కన్పిస్తూన్న ఫాను వైపుచూస్తూ పడుకున్నాడు.

కిటికీలోంచి కన్పిస్తున్న చుక్కల్లో చంద్రుడు చల్లగా నవ్వాడు.

* * *

ఇల్లంతా హడావుడిగా ఉంది. వేణు, అతని ఫ్రెండ్ గోపాల్ రైల్వే స్టేషన్‌కు వెళ్ళారు. వేణు రైలు ఎప్పుడొస్తుందా, తనక్కాబోయే బావ, ఆదర్శమూర్తి ఎలా ఉంటాడా? అని ఆతృతగా ఉంది కానీ పైకి కన్పించనీయడం లేదు.

ఇంటి దగ్గర పరిమళకు కూడా తనకు కాబోయే భర్త, మంచి మనిషి ఎలా ఉంటాడో అని ఆతృత ఉంది కాని పైకి కనిపించనీయడం లేదు.

గది కిటికీలోంచి బయటకు చూస్తుంది

తనకు కాబోయే భర్త అతని నీడలో పూర్తి రక్షణ నిస్తాడని అతని చిరునవ్వులో తనను ఏలలాడిస్తాడని ఎన్నో కలలు కంటుంది.

"ఏమిటో, మా ఆడపడుచు మా తమ్ముడికోసం ఎదురు చూస్తున్నట్లుంది. ఆ కనే కలలేవో తరువాత కందువు గానీ, ఇలాగే దర్శనమిస్తే ఆ వచ్చే ఆయన పారిపోతాడు... టాయ్‌లెట్ అవుదువుగానిరా!" అంది పరిమళ భుజం చుట్టూ చేతులేసి నవ్వుతూ రాధ!

పరిమళ ముఖాన్ని చేతులతో కప్పుకుంది సిగ్గుతో

మరో అరగంటలో ఆ ఇంటి ముందు టాక్సీ ఆగింది.

టాక్సీలోంచి వేణు, ఓ యువకుడు, అతని తల్లి దండ్రులు దిగారు. గోపాల్ పనిమీద వెళ్ళిపోయాడు

గదిలో కర్టెను ప్రక్కనుండి చూస్తుంది పరిమళ పెళ్ళికొడుకును. సుమారు ఆరడుగుల భారీ విగ్రహం. బ్లూపాంట్, వైట్ మీద బ్లూ స్ట్రయిప్స్ షర్ట్ టక్ చేశాడు... చదువు, సంస్కారం, తెలివితేటలు తెచ్చిన ఆకర్షణ ముఖంలో స్పష్టంగా కన్పించింది పరిమళ కళ్ళకు.

కాఫీ ఫలహారాలన్నీ ఐపోయాక— అమ్మాయిని తీసుకు రమ్మన్నారు పెళ్ళివారు.

పుత్తడి బొమ్మలా, అజంతా శిల్పంలా ఉన్న పరిమళను చూసేసరికి పెళ్ళికొడుకు కళ్ళు జిగేల్ మన్నాయి.

మధ్య పాపిడి, అందంగా దువ్వుకున్న అప్పుడే ఆరి నట్లున్న ముంగురులు, గుండ్రని ముఖం, పెద్ద కళ్ళు, అందంగా పొదిగి ఉన్న అవయవాలు... హంసలా నడిచి వచ్చి చాపమీద కూర్చుంది పరిమళ.

"అమ్మాయి ఎలా ఉందే?" భార్యవైపుచూస్తూ అడిగారు పెళ్ళికొడుకు తండ్రి.

అప్పటివరకూ ఏమీ మాట్లాడని, గున్న ఏను గులా ఉన్న ఆమె "అబ్బాయి నడగండి నచ్చిందీ, లేందీను!" అంది— ఆ మాటలో మృదుత్వం లేదనే చెప్పొచ్చు.

"శేఖర్! అమ్మాయి నచ్చిందా?" అడిగాడు తండ్రి...

శేఖర్ నచ్చిందన్నట్లు తలూపాడు...

"అమ్మాయి ఏం చదువుకొంది... కుట్టుపు నేర్చు కుందా? లేదా? అల్లికలు, వంట, కళ్ళాపి, వచ్చా? ఎవర్నెలా చూడాలో తెలుసా?" ఇంకా ఎన్నో ప్రశ్నలు వేసింది పెళ్ళికొడుకు తల్లి.

అన్నింటికీ సమాధానమిచ్చింది పరిమళ ఓపిగ్గా

"ఏమైనా మాట్లాడుకుంటారేమో మాట్లాడు కోండి..." అన్నారు తండ్రి శేఖరుతో.

వేణు సమ్మతించి శేఖర్‌ని గదిలోకి వెళ్ళమన్నారు.

ఇద్దరకు ఏం మాట్లాడుకోవాలో తెలియలేదు. మగాడిగా శేఖర్ తనే ముందు మొదలు పెట్టాడు

"మీరు నాకు చాలా నచ్చారు. నేను మీకు నచ్చానా? మీ కిష్టమైతేనే ఈ పెళ్ళి జరుగుతుంది. ఇందులో బలవంతం ఏమీలేదు. దాంపత్య జీవితం బాగా సాగాలంటే ఇద్దరి మనసులూ ఏకం సాగాలి నేను మీకు నచ్చినట్టేనా?"

"........ ....." మెమ్మదిగా తలూపింది పరిమళ.

ఆమె గుండెలు అతనితో ఊసులాడాలన్నట్లుగా ఎగిసెగసి పడుతున్నాయి.

ఏం మాట్లాడాలా? అని ఆమె హృదయం ఆలోచిస్తుంది...

శేఖర్ పరిమళవైపే సూటిగా చూస్తున్నాడు..

ఆ చూపుల తీక్షణతను తట్టుకోలేక తలదించు కుంది పరిమళ.

అంతలో బయటి నుండి ఏవో మాటలు గట్టిగా విన్పించాయి.

"అలా ఐతే లాభం లేదు.. నాకు చెప్పకుండా మాటిస్తారా? ఇచ్చింది మాటేకదా! తీసేసుకుంటే కొంపేమీ మునిగిపోదు. ఎంత డబ్బోసి చదివించింది అప్పళంగా అప్పజెప్పేయడానికా? ఏం వీళ్ళేదు కన్పించని మాట కంటే కన్పించే మాటే నాకు ముఖ్యం! ఇరవై వేలకు తక్కువైతే ఈ పెళ్ళి పసేమిరా జరగదు....' అందరిమీదా ఎగిరి గంతు లేస్తుంది శేఖర్ తల్లి.

ఆ సంభాషణ విన్న పరిమళ ఒక్కసారిగా తలెత్తి, శేఖర్ వైపు చూసింది. ఆచూపులో ఏమిటన్న ప్రశ్న ఉంది. మీరు కట్నం తీసుకుంటారా అన్న ఆశ్చర్యం ఉంది. ఏం జరుగుతుందో అన్న ఆందోళన ఉంది..

ఆ చూపును అర్థం చేసుకున్న శేఖర్ ఇక అక్కడ ఉండలేక పోయాడు....

వేణు అదోలా ఐపోయాడు.. ఆమె మాటలకు అగ్గిలో దూకినట్లుగా ఉందతనికి. కాని కాస్త తమాయించు కున్నాడు... ఏమీ మాట్లాడలేదు.

రాధ శిలా ప్రతిమలా చూస్తూ ఉండిపోయింది.

అంతలో అక్కడి కొచ్చిన శేఖర్ చేతులుపట్టు కొని "బావగారూ! మీరేమంటారు?" ఎన్నోపదాలు మనసులో ఉన్నా అంతకంటే ఏమీఅడుగలేకపోయాడు

"క్షమించండి వేణుగారూ! మా అమ్మ అభిప్రాయాలే అంత! నా కిష్టం లేకపోయినా, ఆమె ప్రవర్తన నచ్చినా, నచ్చక పోయినా ఆవిడ మాఅమ్మ! చిన్నప్పటి నుండీ ఒక్కడనేనని ఎంతో ముద్దుగా పెంచి, పెద్దవాడ్నిచేసి, నన్నింత ప్రయోజకుడ్ని చేసిన తల్లిదండ్రుల్ని ఎదిరించడం నాకిష్టం లేని పని. నాకెలా ఐనా ఫర్వాలేదు. మా అమ్మనే ఒప్పించండి..." అన్నాడు.

మరుక్షణంలో— ఆ ఇల్లంతా ఖాళీ ఐపోయి తుపాను గల్లంతు చేసిన ప్రదేశంలా, దురదృష్టం చిందులేస్తున్న కోటలా, ఆశ ఆవులించగా విసిరివేయబడ్డ నందన వనంలా ఉంది.

ఎవ్వరి నోటా మాటలు లేవు... మనసుల్లో భావాలు లేవు, కళ్ళల్లో కన్నీళ్ళు తప్ప.

గదిలో మంచంమీద బోర్లా పడుకొని పైకి




అన్ని స్టోర్లలో లభించును

ఉచితం! ఉచితం !!

తెల్లమచ్చలు

మా చికిత్స ప్రారంభించగానే మచ్చల రంగులో మార్పు వస్తుంది. పరీక్షించి మా మందు ఎంత పని చేస్తుందో చూడండి. రోగ వివరాలు వ్రాసి ఉచితంగా ఒక ప్యాకెట్ మందు పొందండి.

**LALIT AYURVEDIC PHARMACY (AW)**
**P.O. Katri Sarai (GAYA)**

దీర్ఘ వ్యాధులకు ఉత్తమసిద్ధవైద్యం!



నరములు బలహీనత
ధాతుపుష్టి యవ్వనశక్తి
హెర్నియా చర్మవ్యాధులకు
పోస్ట్ ద్వారా కూడా కలదు
వరిబీజం (బుడ్డ)
మూత్రవ్యాధులకు
ఆపరేషన్ లేకుండా-రండి

డా॥ దేవర, ఫోన్: 551, మార్వాడిసత్రంవద్ద, తెనాలి.
బ్రాంచి 5/1వ లైను, బ్రాడీపేట, గుంటూరు—2


కన్పించకుండా లోలోన ఏడుస్తూంది పరిమళ. తనకు పెళ్ళి కావడం లేదనే బాధ కంటే, సుఖంగా సంసారం చేసుకోవలసిన తరుణంలో అన్నగారికి తానొక బరువుగా, బాధ్యతగా మిగిలి పోయానన్న బాధే ఆమెను చుట్టు ముట్టుతుంది.

రాధ గుమ్మానానుకొని నిల్చుంది. ఆమెకు తన పెళ్ళి చూపుల్లో వేణు రూపం, సభ్యత, సంస్కారం గుర్తుకొచ్చి ఇప్పటి మనుష్యులంటే ఎంతో అసహ్యం వేస్తుంది.

వేణు గురించి చెప్పనక్కర లేదు... అతనిలో ఆవేదనకు అంతులేదు... ఎంతగా ఆశ పడ్డాడో, ఎంతో ఉన్నతులు తనతో వియ్యానికి వస్తున్నారని ఎంతగా ఆశించాడో అంతగా కుమిలి పోతున్నాడు.. అతనికి ఏడుపు రావడం లేదు.. బాధ మాత్రం కడుపును కొరికేస్తుంది... అతని హృదయాన్ని ఎవరో సూదులతో గుచ్చుతున్నట్లనిపిస్తుంది.

ఎంతో సేపు ఆ గాఢ సుషుప్తిలో;

రాధ వచ్చి "భోజనానికి లేవండి" అంది.



"భోజనం ఎందుకు రాదా! బాధతో నా కడుపు నిండి పోతుంది..."

"బాధ దేనికండీ? రైలు కోసం ఎదురు చూస్తున్నప్పుడు అది వస్తే, ఖాళీగా ఉంటే ఎక్కుతాం, రాకపోయినా, ఖాళీ లేకపోయినా, తర్వాత రైల్లో ఎక్కుతాం... అంతేనండీ ఈ సంబంధాలుకూడా! ఇది కాకపోతే మరోటి, ఇంత మాత్రానికే అంత బాధ పడితే ఎలా చెప్పండి? గదిలో పరిమళ ఏడుస్తూంది... వెళ్ళి ఓదార్చండి...." అంది టవల్ అందిస్తూ.

ముఖం తుడుచుకొని గదిలోకి వెళ్ళాడు వేణు.

పరిమళ అలా పడుకోవడం, ఏడ్వడం చూస్తుంటే అతని గుండె తరుక్కుపోయింది..

ఆ మాటకు ఒక్కసారిగా "అన్నయ్యా" అని వేణు ఒడిలో వాలిపోయింది...

"ఏ ఏడవకమ్మా! ఎందుకు ఏడవడం? ఇతను కాకపోతే మరొకతను... కట్నం ఇచ్చి పెళ్ళిచేయలేక కాదమ్మా! కొనుక్కొని పెట్టుకున్న పూలకంటే, పెరటిలో పూసిన పూలే అందంగా ఉన్నట్లనిపిస్తాయి... దానికేముంది?.... వాళ్ళ ముఖాన కట్నం పారేస్తే పెళ్ళి జరిగి పోతుంది... పూరుకో!" అని ఓదార్చాడు వేణు...

"నా గురించి మీకందరికీ ఎంత బాధ వచ్చిందన్నయ్యా?" ఏడుస్తూ అంది.

"ఛ! అదేం మాట పరిమళా! చెల్లెలు పెళ్ళి చేయడం బాధటమ్మా? ఆశల్ని, ఆశయాల్ని సంస్కారాన్నీ పైకి కన్పించకుండా గుప్పెట్లో మూసేస్తే పెళ్ళిళ్ళు చేయడం చాలా సులువమ్మా!" అంటూ చెల్లెలి కళ్ళు తుడిచాడు వేణు.

ఆ రోజంతా ఆ ఇల్లు జీవకళలేని విగ్రహంలా, వాడిపోయిన ఉద్యానవనంలా ఉంది.

* * *

ఆ మర్నాడు ఆఫీసుకు వెళ్ళలేదు వేణు.. బయట వరాండాలో సిగరెట్ కాలుస్తూ కూర్చున్నాడు.

అంతలో పోస్ట్‌మాన్ వచ్చి ఏదో కవరు ఇచ్చాడు... విప్పి చూశాడు...

అది తన క్లాస్‌మేట్ భాస్కర్ వెడ్డింగ్ కార్డు అందులో ఓ లేటర్ కూడా ఉంది. పని ఒత్తిడివల్ల రాలేక పోతున్నాననీ, నువ్వు తప్పకుండా రావాలని వ్రాసి ఉంది. పెళ్ళి తిరుపతిలో, కాటేజి నెంబరు, అన్ని వివరాలు వ్రాశాడు... పెళ్ళికి వెళ్ళేందుకే నిశ్చయించు కున్నాడు వేణు.

ఆ వెడ్డింగ్ కార్డు చూస్తుంటే... చదువుకునే రోజుల్లో కట్నాలు వద్దని పోటీగా తను,భాస్కర్ వ్రాసిన వ్యాసాలు, ఉపన్యాసాలు ఒక్కొక్కటి గుర్తొచ్చాయి.

* * *

చల్లని దేవుడు ఏడుకొండల మీదున్నా భక్తజనావళికి తనవద్దకు వచ్చేందుకు ఎటువంటి కష్టాలు కలుగకుండా ఎన్నో రకాల వసతులను కలిగించాడు.

ఏడుకొండల మీదున్నా వేంకటేశ్వరస్వామి పాదాల దరకూ ఎందరో శ్రామికులు శ్రమించితను రక్తాన్నీ, ప్రాణాల్ని ఫణంగా పెట్టి వేసిన రోడ్డుమీద నుండి దేవస్థానం బస్సు 'రయ్'న పోతుంది.

## ఓ తిరుమలయ్యా!

కష్టమని దరిజేర
　జుట్టు గొరిగిస్తావు!
　　　　ఓ తిరుమలయ్యా!
ఇష్ట మరి దరిచేర్చు
ఈ నాయకుల తీరు!
　　　　ఓ తిరుమలయ్యా!
ఆదిశేషుని అడుగు
అలవి గాదంటాడు!
　　　　ఓ తిరుమలయ్యా!
ఇంద్రుణ్ణి చూడమన
ఇబ్బంది పడతాడు!
　　　　ఓ తిరుమలయ్యా!
ఏనాడు ఏలితివో
ఈరేడు లోకాలు!
　　　　ఓ తిరుమలయ్యా!
ఈ నాయకుల మధ్య
ఇప్పుడు నిలబడి చూడు!
　　　　ఓ తిరుమలయ్యా!
మా ఓట్లతో పదవి
తుదకు మా మీదనే స్వారి!
　　　　ఓ తిరుమలయ్యా!
దున్నపోతూ దున్న
పిడుచు వగిరించెనట!
　　　　ఓ తిరుమలయ్యా!

— పులికంటి కృష్ణారెడ్డి

హృదయం నిండా బాధ నిండి ఉన్నా ఆ ప్రకృతి మాత ఒడిలో ఉన్న అందాలు, వాతావరణం వేణు మనస్సును కాస్త చల్ల బరుస్తున్నాయి. కొండ శిఖరాగ్రాన్ని చేరుకునే కొద్దీ కిందనున్న మండు టెండలు మటుమాయమయ్యాయి. ఆ ప్రదేశాన్ని చల్లదనం ఆక్రమించుకున్నట్లే, వేణు మనసును ఆహ్లాదం ఆవరించింది.

బస్సు తిరుగుతున్న ప్రతి మలుపూ జీవితంలో ఒక మరుపురాని అనుభవంలా, రోడ్డు పక్కగా నున్న కల్లని పెద్ద పెద్ద శిలలు పెనుభూతాల్లా కనిపించి జీవితంలో ఎదుర్కొవలేని సమస్యల్లా, బస్సు లోంచి కిందకు చూస్తుంటే కళ్ళు తిరిగే లోయలు జీవితంలోని పూడ్చలేని అగాధాల్లా అనిపిస్తున్నాయి వేణుకు.

దేనిమీదా దృష్టి నుంచకుండా, రెప్ప వేయకుండా, రెప్పపాటు అజాగ్రత్తలో ఊహించని ప్రమాదం జరుగుతుందేమోనని డ్రైవరు మాటిగా మార్గం వైపే చూస్తున్నాడు.

ఏడు కొండలనూ ఎక్కి బాగా అలిసిపోయి బస్టాండు దగ్గర ఆగిపోయింది బస్సు.

అందరితోపాటూ వేణుకూడా దిగియాడు.. డైరీలో నోట్ చేసుకున్న కాటేజి నంబరు చూసుకుని, ఒక పది నిమిషాల్లో కాటేజికి చేరుకున్నాడు.

భాస్కర్ వేణును రిసీవ్ చేసుకున్నాడు. తన సహోద్యోగుల కిచ్చిన కాటేజిలోనే వేణుకుకూడా బస ఏర్పాటు చేసి పెళ్ళి తంతుల్లో మునిగిపోయాడు.

రాత్రి ఎనిమిది గంటలకు ముహూర్తం. అందరూ కుర్చీల్లో ఆసీను లయ్యారు. పొరుగుచోటకూడా పందిరి డెకరేషన్ చాలా బాగా చేశారు. పెళ్ళిలో జరుగుతున్న వన్నీ చూస్తుంటే వేలకు వేలు ఖర్చు కనిపిస్తుంది.

ఆ సందడంతా చూస్తుంటే వేణుకు తన చెల్లెలు, ఆమె పెళ్ళి గుర్తుకొస్తున్నాయి. కానీ, తను భాస్కర్ తప్ప మిగిలిన వారందరూ కట్నం అంటే మోజున్నవారే!

"ఛ!" లోకంలో సకల కోటి మానవుల్లోనూ తమిద్దరే గొప్ప అనుకోవడం సిగ్గుగా అనిపించింది.

ప్రతీ చోటా తెలివైన వాళ్ళు,తెలివున్న సంస్కారవంతులూ ఉంటారు. కానీ. ఒకరి కొకరు తారస పడ్డానికే టైము తీసుకుంటుంది. ఆ తరుణం తన కెప్పుడొస్తుందో? తన చెల్లెల్ని పెళ్ళి కూతురిలా చూసుకునే రోజు ఎప్పుడొస్తుందో? అనుకున్నాడు.

అంతలో భాజాలు, భజంత్రీలు మోగడం మొదలయ్యింది.

పెళ్ళి సంబరం కన్నుల పండుగా ఉంది.

మంగళధారణకూడా అయిపోయింది.

బంధువులు, స్నేహితులూ వాళ్ళ ఆనందం కొలదీ పెళ్ళి కొడుకుకీ, పెళ్ళి కూతురికీ ఆభరణాలు, ఆర్టికల్స్, డబ్బు ప్రెజెంట్ చేస్తున్నారు.

వేణుకూడా తను తెచ్చిన గిఫ్ట్ ఇచ్చాడు.

అంతలో వెనక నుండి వినవస్తున్న మాటలు వేణును ఆకర్షించాయి. విన్న వెంటనే అతనిలో ఏదో ఆశ్చర్యం, అనుమానం కలిగాయి.

"ఇది నిజమా? భాస్కరేమిటి? కట్నం పుచ్చుకోవడమేమిటి? తనతో కలిసి ఎన్నో సార్లు 'కట్నాల్ని అరికట్టాలి' అని తీవ్ర వివాదాలు చేసిన భాస్కరు కట్నం పుచ్చుకున్నాడా?" తనలో తనే పదేపదే అనుకున్నాడు. అతని మనసులో ఏదో మూల నుండి బాధ, వ్యాకులత్వం జనిస్తున్నాయి.

పక్కకు తిరిగి చూశాడు. కాటేజి ఉన్న స్థలానికి దిగువగా ఏడుకొండల వాడి బంగారు గుడి అందంగా అమర్చిన లైట్ల కాంతిలో దేదీప్యమానంగా, బంగారు కొండలా మెరుస్తుంది.

ఏడుకొండల వాడా? చూశావా? మంచి వైపుకు మారాలన్న మనుష్యులుకూడా సమయంవచ్చినప్పుడు వాళ్ళకు అవకాశం వచ్చినప్పుడు పూర్తి విరుద్ధంగా మారిపోతున్నారు. చూశావా? ఈ వైపరీత్యం చూశావా? పూర్తిగా సాంప్రదాయాల బురదలో మునిగిన మనుష్యుల్ని మార్చలేక పోయినా, కనీసం ఆదర్శాల ఒడ్డులో ఉన్న వాళ్ళనైనా ఆ బురదలోకి దిగకుండా కాపాడలేవా?", ఎంతో బాధగా అనుకున్నాడు.

అలా ఆలోచిస్తూ యాంత్రికంగా వివాహ వైభవాన్ని చూస్తున్న వేణుకు ఒక రెండు అనుభవాలు

గడించి అలిసి, ఆరి తేరిన కళ్ళు గమనిస్తున్నాయి.

ఐదడుగుల ఏనిమి దంగుళాల విగ్రహం, ముఖంలో మంచితనం, అందం గూడుకట్టుకున్న వేణును ఆ రెండు కళ్ళూ పాయింట్ టూ ఫైవ్ బై ఫోకల్ కళ్ళ జోళ్ళలోంచి జాగరూకతతో పరిశీలించి తృప్తిగా నవ్వుకున్నాయి. పెళ్ళి సంబరం తగ్గు ముఖం పట్టాక వేణు దగ్గరకు ఒకాయన వచ్చి అతని పక్కన కూర్చున్నాడు. పెద్ద కళ్ళు, బట్టతల, కళ్ళకు అద్దాలు, బుర్ర మీసాలు, కొస్త లావుగా ఉన్న శరీరం.

అతను వేణు వైపు పరిచయ పూర్వకంగా నవ్వాడు.

వేణుకూడా చిన్నగా నవ్వాడు.

"నీ పేరేంటి బాబూ?"

"వేణు."

"మీదే వూరు నాయనా?"

"విశాఖపట్నమండీ!'

"ఏం చేస్తున్నావ్?"

"పోర్టులో క్లర్కుగా పని చేస్తున్నాను."

తరవాత కులం గురించి, గోత్రం గురించీ, తల్లి దండ్రులగురించీ ఇంకాచాలావిషయాలుఅడిగాడు.

అన్నీ అడిగాడు గానీ, పెళ్ళయిందా అని పిల్ల తింతమంది అని మాత్రం అడగలేదు.

బహుశా వేణు అవివాహితుడ్లా కనిపించాడేమో అతనికి.

అడిగిన వాటికి మాత్రం వీలైనంత క్లుప్తంగా జవాబు చెప్పాడు వేణు.

అతను ఇవన్నీ ఎందుకడుగుతున్నాడో అర్థం కాలేదు వేణుకు...

ఆఖరుకు తనకో అమ్మాయి ఉందనీ. ఆ అమ్మాయి ఒక్కర్తే తనకున్న సంతానమనీ, రక రకాల పూలల్లో పడుకోబెట్టి పెంచామని నాకున్న ఆస్తి అంతా ఆ అమ్మాయిదేననీ నామ మాత్రానికే ఒక పాతిక వేలు కట్నం ఇచ్చినా, తన ఆస్తంతా కూతురు పేరనే వ్రాస్తానని. వచ్చినప్పుడూ పోయి నప్పుడు అల్లుడి గారి కోరికల్ని తీర్చగలనని... ఈ అబ్బాయికి చెల్లి తప్ప ఇంకెవరూ లేరు గనుక ఈ అబ్బాయికి తన పిల్లనిచ్చి వివాహం చేస్తే, ఆ తరవాత ఇతని చెల్లెలికి పెళ్ళైపోతే తనకూతుర్ని సాధించే వాళ్ళెవరూ ఉండరు కనుక అల్లుడు చెప్పు చేతల్లో ఉంటాడని, అనుకొని ఎన్నోవిధాల ఆలోచించుకొని వేణున వివిధ కోణాల్లోంచి పరీక్షించి తృప్తిగా నవ్వుకొని... అన్నాడు...“ నువ్వు మా అమ్మాయిని పెళ్ళి చేసుకుంటావా?"

ఆ మాటకు బాంబు పేలినట్లయ్యింది వేణుకు...

కానీ... మనసు కాస్త స్థిమిత పరచుకొని తనకు పెళ్ళయిపోయింది అని చెప్పబోయేంతలో ఏదో ఆలోచన అతని తలలో తళుక్కున మెరిసింది.

అంతే!... ఆ ఆలోచన వేణుచేత ఒక ఘోరమైన నిజాన్ని రహస్యంగా దాచింది.

ఫలితం! అనుకున్న చేప వల్లోపడిన జాలరి ముఖంలా వెలిగింది ఆ వ్యక్తి ముఖం...

అంత ఆస్తి ఉండీ ఒక సాధారణ గుమాస్తా తన కూతురికి భర్తగా దొరుకుతున్నందుకే అంత

## హారతి

ఆడదాని అందానికి
హారతి మగవాడు
ఆరిపోతే అవుతాడు
అతనొక పిచ్చివాడు

— ఎల్లోరా

ఇదై పోతున్నాడంటే... ఆ ఇదికి ఏదో కారణం ఉండాలి కదా?

అదేమిటంటే ఆ అమ్మాయి పాపం ఎవరిమీదో మనసు పారేసుకుందిట... ఆ పారేసుకోడం ఇష్టం లేని తండ్రి ఆమె మనసును పెద్ద పెద్ద ఆఫీసర్ల మీదకు విసిరితే... ఆ అమ్మాయి ప్రేమ కథంతా తెలిసిన, తెలుసుకున్న వాళ్ళు ఆ మనసును తిరిగి అతని మీదే విసిరేసారు.

దాంతో ముఖం వాడిపోయింది. అతనికి... అందుకే... తనకెలాగూ డబ్బుంది కదా ఇంకా అల్లుడికి డబ్బుంటే ఏమి? లేకపోతేనేమి? అన్న బుద్ధి తెచ్చుకొని... వూరిమీద పడ్డాడు అల్లుడి కోసం...

వేణు ఒక షరతు పెట్టాడు... "నాకు ఆడంబరంగా పెళ్ళి చేసుకోడం ఇష్టం ఉండదు. అంచేత గుళ్ళో అయితేనే పెళ్ళి చేసుకుంటాను..." అన్నాడు.

"దానికేముంది...? అలాగే! నీ ఇష్టమే నా ఇష్టం! ఖర్చు కూడా తగ్గుతుంది..." అని ఆనందంతో గంగిరెద్దులా తలూపి ఒప్పేసుకున్నాడు ఆ వ్యక్తి ఉరఫ్ రమణయ్య.

* * *

పెళ్ళి అతి వైభవంగా జరుగుతుంది...

కట్నం ఇవ్వకుండా చేద్దామనుకున్నా — రాజీ పడలేని పరిస్థితుల మధ్య — మనింట్లో పూసిన మల్లె మొగ్గైనా అది వికసించి సువాసనల్ని వెదజల్లి వాడిపోకుండా ఉండదని తెలుసుకొని — ఆ పూవు వాడి పోక ముందే జాగ్రత్త తీసుకోవడం మంచి దని అనుకున్న వేణు తన చెల్లెలు పరిమళకు కట్నం ఇచ్చే పెళ్ళి చేస్తున్నాడు.

ఈ రోజు అతనిలో ఎంతో ఆనందం — కానీ, ఆ ఆనందం వెనుక రాబోతున్న ప్రళయంల ఆ ప్రళయం ఏం చేయబోతున్నదో అన్న భయం లేకపోలేదు.

ఏది ఏమైనా అన్నగా తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తున్నాడు...

కానీ!...రాధ! రాధను చూస్తున్నప్పుడల్లా వేణు గుండె కలుక్కుమంటుంది... రేపు రాబోయే ఉపద్రవం తెలియని రాధను చూస్తుంటే తుఫాను ముందటి ప్రశాంతత జ్ఞాపకం వస్తుంది.

అతనిలో రేపటి గురించి ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి.

అతనిలో భయం, ఏదో మొండి ధైర్యం ఒక దాని తరవాత ఒకటి, ఒక్కుమ్మడిగా కలుగుతున్నాయి.

పెళ్ళి జరిగిపోయింది.

కట్నమిచ్చి కొనుక్కున్న బావగారు, చెల్లెలు తన కాళ్ళకు దణ్ణం పెట్టారు...

పది కాలాల పాటు సుఖంగా ఉండండి... అని దీవించాడు... ఆ దీవెనలో ఏదో లోటు. వాళ్ళ సుఖం ప్రారంభమైన మరుక్షణం నుండి తన జీవితంలో కష్టాలు ప్రారంభమవుతున్నాయి...

ఆ వూహకే చలించిపోయాడువేణు... వీళ్ళ పెళ్ళికి ముందే తను రెండో పెళ్ళిచేసుకున్నాడు... కట్నం చేసుకున్నరెండో భార్యను ఈ ఇంట్లోకి ఎలా తీసుకు రావాలి? తన నో పెద్ద ఆదర్శమూర్తిగా భావించి అతిగా ప్రేమిస్తున్న రాధలో ఆ సమయంలో కలిగే అల్లకల్లోలం తను చూడగలడా! చూసి సహించగలడా?

అతనికేమీ పాలుపోవడం లేదు... మనసంతా భయాందోళనతో నిండిపోయింది...

మరునాటి కల్లా ముఖ్యమైన వాళ్ళు తప్ప, పెళ్ళి చుట్టాలందరూ వెళ్ళిపోయారు...



వేణు ఎక్కడికో బయలుదేరాడు...

"రాత్రంతా నిద్రలేదు. ఇప్పుడెక్కడికి?" అని అడిగింది రాధ.

"ఎక్కడికీ లేదు. ఇక్కడికీ..."

ఆ సమాధానంలో జీవం లేదు. రాధ ముఖం వైపు చూడలేక పోతున్నాడు వేణు...

చెల్లెలు పెళ్ళి జరుగుతున్నప్పుడు జరిగిం తరవాత కూడా వేణు ముఖంలో నవ్వు చూడలేదు రాధ... ఏదో పోగొట్టుకున్న వాడిలా ఉన్నాడు... ఎంతటి కష్టాలొచ్చి పడినా, నవ్వుతూ తిరిగే వేణు అలా అయిపోవడంలో అంతరార్థం పాపం రాధ గ్రహించలేకపోయింది.

తను బతికుండగానే , తనలో ఏ లోపం లేకుండ గానే తనతో కనీసం ఒక మాటైనా చెప్పకుండానే తన భర్త పునర్వివాహం చేసుకుంటాడని ఏ భార్య అనుకోగలదు?

పచ్చని ఆ పందిట్లో నవ్వుల వాణి ప్రవహి స్తున్న ఆ ముంగింట్లో ఆనందపు తొలకరిజల్లు పడుతున్న ఆ ఇంట్లో ఒక పెద్ద ప్రళయాన్ని సృష్టించాలని కాలం జోరుగా పరుగులు తీస్తుంది...

ఆ సమయం వచ్చిందన్నట్లుగా — ఆ ఇంటి ముందు ఒక టాక్సీ ఆగింది... అందులోంచి వేణు, పెళ్ళికూతుర్లా అలంకరించుకున్న ఒకఅమ్మాయి, ఆ అమ్మాయి తలిదండ్రులు దిగారు...

"ఎవరా?" అనుకుంటూ ఇంట్లోంచి అందరూ బయటికి వచ్చారు...

వాళ్ళెవరివైపూ చూడకుండా "రండి... రా రమణి!" అని వాళ్ళను తీసుకెళ్ళాడు వేణు.

"ఇదేంటల్లుడూ! నీ కెవరూ లేరన్నావ్?ఇంట్లో ఇంతమందున్నారేమి?" అన్నాడు రమణయ్య.

"మా చెల్లి పెళ్ళి చేశాన్లెండి..."

"మరిపెళ్ళి దగ్గరికి మీ చెల్లి రాలేదేం అని అడిగితే ఇంకో వూర్లో చదువుతుంది...పరీక్షలః అన్నావేమయ్యా?"

"అదంతా మీకే తెలుస్తుంది... లోపలకు రండి..."

ఆ సంభాషణవిన్న అక్కడి వాళ్ళందరికీ ఏమీ అర్థం కాక అంతా అయోమయంగా ఉంది.

కొంతమంది దగ్గరి వాళ్ళు ఎవరని అడిగినా వేణు సమాధానం చెప్పకుండా వాళ్ళను లోపలకు తీసుకెళ్ళి కూర్చోబెట్టాడు... అందరూ అక్కడ మూగారు..

"ఇదేంటండీ, మా వంక పర్కాస్సులో ఏనుగ ల్లాగ చూస్తున్నారు... అసలు మీరంతా ఎవరు?" రమణి తల్లి కస్సుమంది.

"మేమూ అదే అనుకుంటున్నాం... అసలు మీరెవరు? ఏరా వేణూ! వీళ్ళంతా ఎవరు?" అని అడిగాడాయన... వేణు ఒక్కసారి అందరివైపూ చూశాడు...

అందరూ దగ్గర చుట్టాలే!

కొంచెం దూరంలో పరిమళ, ఆమె భర్త తన వైపు అదోలా చూస్తున్నారు...

గుమ్మం దగ్గర రాధ... ఏమిటో అర్థం గాక అయోమయంగా చూస్తుంది...

అందరి కళ్ళల్లో ఆశ్చర్యం... ఎవరో మళ్ళీ రెట్టించి అడగడంతో వేణుకు తప్పలేదు...

"వీళ్ళు మా అత్తగారు... మావగారు.. ఈమె నా భార్య!"

అందరూ ఆ మాటకు ఉలిక్కిపడ్డారు.

"అన్నయ్యా! ఏమిటి నువ్వంటున్నది?" పరిమళ గట్టిగా అరిచినట్టుగానే అంది... వేణు తల దించేసుకున్నాడు.

రాధ వాళ్ళ నాన్నగారు, అమ్మా... "ఏమిటి నాయనా ఇది? అంతా వింతగా ఉందే" అన్నారు ఆందోళనగా — పరిమళ అత్తగారు, మావగారు... "ఏముందో చెప్పు!" అన్నారు.

పరిమళ ఏడుస్తుంది. ఎదురుగా ఉన్న రాధవైపు తలెత్తి చూడలేక పోయాడు వేణు...

అంతలో ఎవరో "రాధా! అలా కొయ్యబొమ్మలా నిల్చున్నావేం? వెళ్ళి అడుగు... ముందు పిన్ను చేసుకొని, ఏం కారణం లేకుండానే మళ్ళీ పెళ్ళి చేసు కోవడంలో అర్థం ఏమిటో అడుగు..." అని రాధను వేణు దగ్గరకు తీసుకొచ్చారు.

రాధ ఏమీ మాట్లాడలేదు... గుండెల్లో అగ్ని పర్వతాలు బద్దలవుతున్నా కళ్ళల్లోంచి కన్నీళ్ళు రాకుండా దుఃఖాన్నంతా గుండెల్లోనే దిగ మింగు తుంది...

ఆమె హృదయంలో చురకత్తులు గుచ్చుకున్న ట్లుగా ఉంది...


వేణు నెమ్మదిగా తల ఎత్తాడు.

రాధను చూసే సరికి ఒళ్ళంతా జల్లుమంది వేణుకు.

తనమీద తనకే అదోరకం రోత పుట్టింది... ఇంత అమాయకురాలైన రాధకు తనెంత అన్యాయం చేశాడు. అదే స్థానంలో మరొకరుంటే ఎలా ప్రవ ర్తించేవారు...? కాని రాధ... అనుకోకుండా వేణు కళ్ళ ల్లోంచి రెండు కన్నీటి చుక్కలు రాలాయి...

"రాధా! నన్ను క్షమించు... ఏదో అనుకొని, ఏదో ఆలోచించి, నీకు అన్యాయం చేశాను...నేనేంచేసినా పాప విముక్తి ఉండదు..." ఏడుపు పర్యంతం






అయింది వేణుకు.

రాధ ఏమీ మాట్లాడలేదు... అలాగే మవునంగా వేణు వైపు చూసింది...

"వద్దు రాధా! అలా చూడకు. ఆ అమాయకమైన చూపు నన్ను నిలువునా కాల్చేస్తుంది..."

"అన్యాయం అల్లుడూ!... అమ్మ—ఇంతమోసం చేస్తావనుకోలేదు... పెళ్ళయిపోయినా కాలేదని అబద్ధం చెప్పి, పాతిక వేలు కట్నం పుచ్చుకొని...మా అమ్మాయి గొంతు కోస్తావా?" అని రమణయ్య లేచాడు.

"ఎంత మోసం చేశావ్? ఇంత మోసకారి వనుకోలేదు... పెళ్ళంటే ఏమనుకున్నావ్? ఏదో ఆషామాషి అనుకున్నావా? డబ్బు కోసం కక్కుర్తి పడి ఇలాంటి పనులు చేస్తావా?" రమణి తల్లి గట్టిగా అంది.

"ఆగండి..." గట్టిగా అరిచాడు. "ఎందుకలా నోరు పారేసుకుంటారు? అవును ... నేను కక్కుర్తి పడ్డాను. డబ్బుకోసమే కక్కుర్తి పడ్డాను. కానీ ఎందుకు కక్కుర్తి పడ్డానో అని ఎవరైనా అడిగారా? ఎవ్వరైనా ఆలోచించారా? నేనూ మీలానే ఆదర్శాలు వల్లించేవాడ్ని ... ఆచరించేవాడ్నికూడా! నేను ఆచరించే ఆదర్శాలే నా మీద దెబ్బకొట్టాయి. కట్నం పుచ్చుకోవడం నేరమని, అన్యాయం అనీ, అమానుషం అనీ అనుకున్నాను. ఆదర్శంగా పెళ్ళి చేసుకున్నాను. కానీ ... చివరకు, నాదగ్గరకు, నా చెల్లెళ్ళ పెళ్ళి చేయడాని కొచ్చేసరికి నా ఆదర్శాలు నా కేమీ సహాయం చేయలేక పోయాయి. నా చెల్లెళ్లు పెళ్ళి చేయలేక పోయాను. ఎందరో పెద్ద పెద్ద చదువులు చదివిన వాళ్ళు పెళ్ళి చూపులు కొచ్చారు. పిల్లని చూశారు. అందంగా ఉందన్నారు. అణకువగల పిల్లన్నారు. చదువుకూడా బాగానే చదివిందన్నారు. ఈ పిల్లలాంటి పిల్ల లేదే అన్నారు. కాని చివర్న లాంఛనాలు అనేవారు కట్నం లేకపోతే మేం చేసుకోం అనేవారు ... పాత భావాల్తో నిండిపోయిన తల్లిదండ్రులు కట్నం అడుగుతుంటే, ఈ నాగరిక నవ సమాజంలో పెరుగుతున్న ఈ తరం వాళ్ళు కూడా అలా చూస్తూ వూరుకునే వాళ్ళే కానీ, ఎవ్వరూ తల్లిదండ్రుల్ని ఎదిరించలేకపోయేవారు... ఎదిరించడం మా అభిమతం కాదనేవారు. కని పెంచిన తల్లిదండ్రుల మాటకు అడ్డు చెప్పలేం అనేవారు. తల్లిదండ్రుల మీద గౌరవం అన్యాయాలకు దారితీసేదిగా ఉండకూడదని పాపం వాళ్ళు గమనించలేకపోయారు. తర్వాత పిల్ల బాగా లేదనేవారు. వెళ్ళిపోయేవారు. కొందరైతే కట్నంవద్దనేవారు. మాకు కట్న కానుకలు కాదు, పిల్ల ముఖ్యం అనేవారు. వాళ్ళను చూసి నేనెంతో ఆనందపడేవాణ్ని. వాళ్ళే ఈ సమాజపు రథానికి బంగారు చక్రా లనుకునే వాణ్ని. కానీ ... ఆఖర్న కట్నం వద్దుగానీ, ఏదైనా ఇల్లైనా, పొలమైనా వాళ్ళ పేర వ్రాయమనే వారు. వాళ్ళను కసిరి కొట్టేశాను. ఇలా ఎన్నో సంబంధాలు కోసం తిరిగాను. నా కాళ్ళరిగేలా తిరిగాను. కట్నం పుచ్చుకోకుండా నా చెల్లెళ్ళ చేసుకునే మగవాడు ఎక్కడైనా దొరుకుతాడేమోనని తిరిగాను. కానీ ... నాకు దొరికింది శూన్యం!" ఆవేశంగా అన్నాడు.

"ఈ కట్నం ఒక బలమైన విషసర్పం! దీన్ని చంపాలని ఎందరో ఎదురు తిరుగు తున్నారు. కానీ దాన్ని చంపడానికి ఈ కొద్దిమందీ చాలరు... ఈ కొద్దిమందీ దాన్ని చంపలేరు. దాన్ని చంపాలంటే అందరూ బయల్దేరాలి. అందరూ ఒక్కుమ్మడిగా ప్రతిఘటించాలి. కానీ ... ఏదీ? ఎక్కడ? అలాంటి వాళ్ళెక్కడ? ఎవరో మాటకొక్కడు మారితే చాలదు. అందరూ మారాలి! కానీ ఎలా? ఈ సమాజం పూర్తిగా మారలేదు. సమాజం సగమే మారితే... ఆ మారిన వాళ్ళ పరిస్థితి నాలానే ఉంటుంది. ఆదర్శాలు వల్లిస్తూ, పెద్దల మాట వినకుండా, కట్నం పుచ్చుకోకుండా తాము పెళ్ళి చేసుకుంటారు. కానీ... తమ తరపు ఉన్న ఆడపిల్లలకి పెళ్ళి చేసేసరికి వాళ్ళ ఆదర్శాలకు ఉన్న బలం, విలువ అప్పుడు తెలుస్తాయి. నాకూ అలాగే జరిగింది.

అందుకే! డబ్బిచ్చే నా చెల్లెలికి పెళ్ళి చేయా అనుకున్నాను. డబ్బిచ్చే నా జావమ కొనుక్కుందా మనుకున్నా:... కాని ఎలా?

అలాంటి సమయంలో —

కూతురికి డబ్బిచ్చే భర్తల్ని కొనాలని, డబ్బా లేనే గాని పెళ్ళి చేయలేమని, అనుకున్న ఈ రమణయ్యగారు దొరికారు. నాలో ఆదర్శాలకు అడ్డుగోడ కట్టేశాను. మానవత్వాన్ని దూరంగా నెట్టేశాను. నేను డబ్బు పుచ్చుకుని అబద్ధం చెప్పి రెండో పెళ్ళి చేసుకున్నాను. ఆ డబ్బుతో నా చెల్లెలు పెళ్ళి చేశాను. నే నెందు కిలా చేశానో ఇప్పుడైనా అర్థమైందా? నా భార్య మంచితనాన్ని, అణకువను తెలిసికూడా — ఒక స్త్రీ దేనినైతే సహించలేదో అదే చేశాను. దానికి కారణం ఏమిటి? కేవలం కట్న పిశాచం! ఆ పిశాచం పిచ్చి అరుపుకు తట్టుకోలేకపోయాను. మరో స్త్రీని నా జీవితంలో ప్రవేశపెట్టుకొని ఆమెకు అన్యాయం చేయగూడదని తెలిసినా ఆ పని తెగించి చేశాను."

"ఐతే ఇప్పుడేం చేస్తావ్? ఇద్దరు పెళ్ళాల్తో కులుకుతావా? నా కూతురి పచ్చని జీవితాన్ని ఎడారిలా మారుస్తావా?" రాధ తల్లి ఆవేశంగా అడిగింది.

"అన్నయ్యా! నాకోసం, నా సుఖంకోసం ఎంతో గొప్పపని చేశా ననుకుంటున్నావా? అది ఎంత నీచమైన పనో నీకు తెలుసా? నువ్వు చేసిన ఈ ఘోర పాపం ఒదినను ఎంతగా క్రుంగదీస్తుందో, ఎంతగా ఆమె మనసు ఆక్రోశిస్తుందో గమనించావా?"

"చెల్లెమ్మా! పరిమళా! నువ్వేనా ఆ మాటంటున్నది?" భోరున ఏడ్చాడు వేణు.

"చేసిందంతా చేసి ఎందుకలా ఏడుస్తావ్? నా కూతుర్ని మోసం చేశావని, డబ్బుకోసం నా కూతురి జీవితాన్ని పాడుచేశావని పోలీసు రిపోర్టు ఇస్తానుండు. ఈ ఏడుపేదే అక్కడే ఏడుద్దువుగాని..." రమణయ్య పంచె ఎగదోపి వేణుపై ఎగిరాడు...

"రమణయ్యా!" ఎక్కడినుంచో ఒక కంఠం

## పూర్ణిమ రాత్రి

పూర్ణిమ రాత్రి
నిర్మలాకాశంలో నీవు
నీ చుట్టు చుక్కల వెలుగు.
కీచ కీచలు గలగలలు
నీ ముసి ముసి నవ్వుల విరిజల్లులు
నీ ముందు నేను —
నీ సోయగాల శోభతో
తన్మయుడనైన తనువుతో
చేతులు చావి
నీ అధరామృతాస్వాదనకై
అలమటిస్తున్నట్లు
కలవరిస్తున్నట్లు
కల

— 'రసస్రవంతి - 'కావ్యసుధ'

గట్టిగా అరిచింది.

అందరూ అటువైపు చూశారు.

గుమ్మానానుకొని ఉన్నాడొక వ్యక్తి. గెడ్డం బాగా పెరిగి ఉంది. బట్టలు మాసి ఉన్నాయి. చేతికి, తలకు కట్లు కట్టి ఉన్నాయి. కళ్ళల్లో ఏదో పోగొట్టుకున్న బాధ. ముఖంలో ఏదో దైన్యం!

రమణయ్య గుండె ఒక్కసారిగా ఆగింది.

"రమణయ్యా! ఇయ్యి! పోలీసు రిపోర్టు ఇస్తావో కోర్టుకే వెళ్తావో వెళ్ళు! నీతోపాటూ నేను వస్తాను. నాకు నువ్వు చేసిన అన్యాయం నేనూ ఏకరువు పెడ్తాను. అప్పుడు నువ్వు జైలుకు వెళ్తావో, నేను వెళ్తానో, ఆయన వెళ్తారో తెలుస్తుంది. రమణయ్య దగ్గరకు వచ్చి బెదిరింపుగా అన్నాడు వ్యక్తి.

"సత్యం!" అంటూ రమణి అతని దగ్గరకు వెళ్ళిపోబోయింది.

"రమణీ! నువ్విలా రా! ఆ దుర్మార్గుడి దగ్గరకు వెళ్ళకు" అని రమణయ్య గట్టిగా కూతుర్ని పక్కకు నెట్టాడు.

"ఎవరు మీరు?" వేణు అతని దగ్గరకు వెళ్ళి అడిగాడు.

"చెప్తాను ... నేనెవర్నో, ఈరమణయ్య ఏం చేశాడో అంతా చెప్తాను. నేను ఒక ప్రేమ పిచ్చి వాణ్ణి. ఈ రమణయ్య కూతుర్ని గాఢంగా ప్రేమించాను. రమణి కూడా నన్ను ప్రేమించింది. ఇద్దరం పెళ్ళిచేసుకొని హాయిగా బ్రతుకుదాం అనుకొన్నాం! కానీ, ఈ రమణయ్య అది పడనివ్వలేదు. నేను కులం తక్కువ వాడ్నని, డబ్బులేని వాడ్నని రమణిని నాకిచ్చి పెళ్ళి చేయనన్నాడు. బ్రతిమాలాను. కాళ్ళు పట్టుకున్నాను. ఆఖరుకు బెదిరించాను కూడా! రమణి ఎక్కడికైనా వెళ్ళిపోదాం అంది ... కానీ, అలాచేస్తే సమాజం ఏమంటుంది? లేచిపోయాం అంటుంది. అది పాపం అంటుంది. అందుకే ఎలాగైనా రమణయ్యను ఒప్పించాలని అనుకున్నాను. కానీ దాని ఫలితంగా నా ఉద్యోగాన్ని ఊడగొట్టించాడు. పది మందిలో నన్ను ఘోరంగా అవమానించాడు. తన మనుష్యులచేత కొట్టించాడు కూడా! నేను ఆసుపత్రిలో ఉండగా ఇలా చాటున పెళ్ళి జరిపించాడు. హాస్పిటల్ నుండి డిస్చార్జి అయ్యాక అక్కడ అడిగితే ఈ వూర్లో పెళ్ళి అని తెలిసింది. ఆఖరుకు ఎలాగో అరగంట క్రితం ఇక్కడకు రాగలిగాను. అంతావిన్నాను. వేణుగారూ! మీరు చాలా మంచి పని చేశారు. ఈ సమాజానికి భయపడకుండా ఒక మంచిపనిచేశారు. కట్నాలు పుచుకునే వారికి, ఇచ్చేవారికి బుద్ధివచ్చేట్టుగా చేశారు."

అందరికీ ఆతృత, ఆశ్చర్యం కలుగుతున్నాయి.

ఒకోళ్ళకళ్ళు ఏదేదో చెప్పుకుంటున్నారు.


రాధ, పరిమళ ఇద్దరూ నిర్జీవంగా ఐపోయారు.

"ఒదినా! నా వల్లే కదు నీ కింత అన్యాయం జరిగింది. నా వల్లే కదూ నీ బ్రతుకిలా నాశనం అయ్యింది?" రాధను పట్టుకొని ఏడుస్తుంది.

ఆ మాటలు వింటుంటే వేణుకు తనమీద తనకే అసహ్యం వేస్తుంది.

ఏం చేయాలో ఏమీ పాలుపోవడం లేదు.

రమణిని ఒక్కసారి చూశాడు వేణు. మౌనంగా తల దించుకొని ఉంది.




మరుక్షణం ఒక ఆలోచన వచ్చింది వేణుకు.

"సత్యంగారూ! మీరేమీ అనుకోనంటే నే నొకటి చెబుతాను వింటారా?"

"చెప్పండి". . .

"రమణిని చూశారా? మిమ్మల్ని ప్రేమించి పొందలేక, తల్లి దండ్రుల్ని ఎదిరించలేక అయోమయ పరిస్థితిలో పడి ఎలా ఉందో? నే నామెను పెళ్ళి చేసుకుంది కేవలం డబ్బు కోసం. నా చెల్లెలు జీవితం కోసం. కానీ రమణి బలై పోయింది. పెళ్ళి చేసుకున్నాను అంటే ఆమె మెడలో ఒక పసుపు తాడు కట్టాను. అంతే! మెడలో ఆ తాడు కట్టడం వల్ల మా మనసులు పూర్తిగా కలిసిపోయి, కొంగులు ముడివేసుకుని ఏడడుగులు నడవడం వల్ల మా తనువుల పెన వేసుకు పోయాయి అని అనుకోనంటే మీరు ప్రేమించిన రమణిని మీరే పెళ్ళి చేసుకోండి. ఇది నా సమస్యకు పరిష్కారం కోసం మాత్రమే కాదు. మీ అనిర్వచనీయమైన ప్రేమ నిలవడం కోసం, దానికి పరిపూర్ణత్వం కలగడం కోసం మీ జీవితాలు కళకళ లాడడం కోసం. ఇందులో మీ అభిప్రాయం నిర్మొహమాటంగా చెప్పండి". అన్నాడు వేణు.

"థాంక్స్ వేణుగారూ! మీ ఆలోచనలూ, నా ఆలోచనలూ ఒకే దిశలో ప్రయాణం చేస్తున్నాయి. నేనూ అదే అనుకుంటున్నాను. కానీ, మీరే ధైర్యం చేశారు. కేవలం ఒక పసుపు తాడు కట్టడం వల్ల రమణి మీ సొంతం కాలేదు. రమణి నా సొంతం అయిపోయింది. మీ అభిప్రాయాన్ని నే నంగీకరిస్తున్నాను. ఏమంటారు రమణయ్యగారూ!"

"ఏమంటాను సత్యం! క్షమించమంటాను. నేను చేసిన వెధవ పనికి ఎందరు బాధ పడ్డారో చూస్తూనే బుద్ధొచ్చింది" అన్నారు రమణయ్య.

"దీనంతటికీ మీరే కారణం కాదు. అందరూనూ! కట్నం ఇచ్చి ఆడపిల్లలకు పెళ్ళి చేయాలనుకునే వాళ్ళు, కట్నం పుచ్చుకునే వాళ్ళు ఉన్నంతవరకూ ఇలాంటివే కాదు. ఇంకా ఎన్నో రకాల సమస్య లొస్తాయి. ఇచ్చే వాళ్ళుంటే పుచ్చుకునే వాళ్ళు ఉంటూనే ఉంటారు. అందరూ ఇవ్వక పోతే పుచ్చుకునే వాళ్ళేమవుతారు? ఇదొక్కటే పెద్దలు పిన్నలు అందరూ ఆలోచించాలి.'అని సత్యం అన్నాడు.

"సారీ! వేణూ! నన్ను క్షమించండి. తల్లి దండ్రుల్ని ఎదిరించలేక, వాళ్ళ మాటల్లో పడి నిజమేమిటో మరిచి పోయాను. నాకు కట్నం వద్దు. ఆ డబ్బు వాళ్ళకు తిరిగిచ్చెయండి. మీరేమంటారు నాన్నగారూ!" అన్నాడు పరిమళ భర్త.

"నేనే మంత్రూనా? అంతా చూశాక ఏమైనా అనగలనా? ఏదైనా అంటే నన్ను బతకనిస్తారా? ఆ."

అందరూ ఒక్కసారిగా నవ్వుకున్నారు.

ఆ నవ్వుల్లో సత్యం, రమణి దండలు మార్చుకున్నారు. *

---

మహామేధావుల జీవిత చరిత్రలు అతి చిన్నవిగా ఉంటాయి.

— ఎమర్సన్

మనకు అందుబాటులో ఉన్నవాటిని కోరడం మంచి కానీ కోరిన వాటికోసం అర్రులు చాచడం మంచిది కాదు

— హెన్రీ వాన్‌డైక్